క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి



ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణ ముఖి నది తీరాన వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనృసింహ స్వామి ప్రత్యేక అలంకరణలో గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు పలుప్రాంతాల నుంచి వేకువజామునే స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుడు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు వివిధ రకాల పుష్ప, పత్రాలతో స్వామివారిని అలంకరించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి పూజల్లో పాల్గొన్న భక్తులందరికీ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాల వితరణ చేశారు.

గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు



గెడ్డలుప్పిలో చెత్తకుప్పలను ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న కూలీలు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన గెడ్డలుప్పి, నూరంపేట, చినభోగిలి,తామర ఖండి గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గెడ్డలుప్పిలో నాలుగు రోజులుగా కాలువల్లో తీసిన పూడికలు, చెత్తకుప్పలను, వీధుల్లో చేయించిన పారిశుద్ధ్య పనులతో చేరిన చెత్తను ట్రాక్టర్ సహాయంతో దూరప్రాంతాలకు తరలించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మోహనరావు, పద్మావతి, లక్ష్మి పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు

సీతానగరం: వర్షాలు కురవడం వల్ల విస్తరిస్తున్న దోమల నివారణకు పంచాయతీ కార్యదర్శులు ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు విస్తరించే అవకాశం ఉందని, దోమలు కుట్టడం వల్ల జ్వరాల బారిన పడతారన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించడం, తాగునీటి పథకాల ట్యాంకుల్లో క్లోరినేషన్, మట్టిగుంతల పూడ్చివేత, బ్లీచింగ్ చల్లడం వంటి పనులు జరుగుతున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఓ భాను పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌తో తాగునీటి సరఫరా



పూతిక వలసలో సౌర విద్యుత్ ఆధారిత మంచినీటి ట్యాంక్

సాలూరు రూరల్: మండలంలోని పూతిక వలస గిరిజన గ్రామంలో సౌర విద్యుత్‌తో తాగునీటి సరఫరా జరుగుతోంది. గ్రామంలో 28 ఇళ్లు ఉన్నాయి. ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేశారు. గ్రామంలో విద్యుత్‌తో సంబంధం లేకుండా నిత్యం తాగునీరు అందుబాటులో ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు.

అగ్రిగోల్డ్ సమస్యలు పరిష్కరించాలి

● ఎమ్మెల్యేకు డిపాజిట్‌దారుల విన్నపం

పార్వతీపురంటౌన్:

అగ్రిగోల్డ్ సమస్యలు పరిష్కరించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించమని రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బాధితులంతా పెద్ద ఎత్తున ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకుని సాధ్యమైనంత త్వరగా అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని మేనిఫెస్టోలో పెట్టినందుకు ఎన్‌డీఏ కూటమికి ధన్యవాదాలు తెలిపి సాధ్యమైనంత త్వరగా అగ్రిగోల్డ్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనికి ఎమ్మెల్యే స్పందించి అగ్రిగోల్డ్ సమస్యను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఆర్‌వీఎస్ కుమార్ అసోసియేషన్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గెంబలి శ్రీనివాసరావు, సాలాపు అనంతరావు, నాయకులు ఎల్లంకి శ్రీనివాసరావు, బాసిగాన వెంకటరమణ (చిరు), ఎం. శ్రీరాములు, ఎస్.గౌరీశంకర్రావు, తులసి మాస్టార్, ఇజ్జురోతు శ్రీను తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే విజయ్ చంద్రతో మాట్లాడుతున్న అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

నెల్లిచెరువులో ఆక్రమణలు తొలగించాలి



ఆక్రమణలు పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

● సీపీఎం డిమాండ్

పార్వతీపురంటౌన్: పట్టణంలోని నెల్లిచెరువులో ఆక్రమణలు తొలగించాలని సీపీఎం పట్టణ నాయకులు జి. వెంకటరమణ, బంకురు సూరిబాబులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని నెల్లిచెరువులో పెత్తందార్లు కట్టుకున్న విల్లాలు, పక్కా ఇళ్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా నెల్లి చెరువులో పాకలు, రేకు ఇళ్లు కట్టుకుని, పేదలు పట్టణంలో కూలి పనులు చేసుకుని జీవిస్తుంటే అటు మున్సిపల్ అధికారులు, ఇటు రెవెన్యూ అధికారులు పేదలపై జులుం చేసి బలవంతంగా పాకలు పీకి వేయడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పట్టణానికి దూరంగా స్థలాలు ఇస్తామని చెప్పి మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. కొంతమంది పెద్దలు, ప్రభుత్వ ఉద్యోగస్తులు, పెత్తందారులు పక్కా ఇళ్లు, అతి పెద్ద విల్లాలు కట్టుకుంటున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమనారు. ఇప్పటికైనా నెల్లిచెరువు మొత్తాన్ని సర్వే చేసి ఎవరైతే అర్హత కలిగిన పేదలు ఉన్నారో వారందరికీ పట్టాలిచ్చి రెగ్యులర్ చేయాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. పేదలకు న్యాయం చేయాలని, లేకపోతే రానున్న కాలంలో పట్టణంలోని మురికివాడల్లో నివసిస్తున్న పేదలందరినీ కదిలించి పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని అధికారులను హెచ్చరించారు.

వైఎస్ఆర్ విగ్రహానికి ముసుగు తొలగింపు



గాదిపల్లి వలసలో వీధిదీపాలను సరిచేస్తున్న సిబ్బంది

సాలూరు రూరల్: ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ మండలంలోని తోణాం గ్రామంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి విగ్రహానికి ముసుగు తొలగలేదని సాక్షిలో ప్రచురితమైన వార్తకు ఎంపీడీఓ ఫణీంద్ర కుమార్ స్పందించారు. ఈ మేరకు గురువారం ఆయన విగ్రహానికి వేసిన ముసుగు తొలగించారు. అలాగే గ్రామంలో శిలాఫలకంపై ఉన్న సున్నం కోటింగ్‌ను చెరిపివేయించారు. గాదిపల్లి వలసలో పట్టపగలు విద్యుత్ కాంతులని ప్రచురితమైన వార్తకు స్పందించి విద్యుత్ దీపాలను సరిచేశారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా పనిచేస్తామని ఎంపీడీఓ ఈ సందర్భంగా తెలిపారు.

వైఎస్సార్ సీపీ అధినేతను కలిసిన కళావతి



వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: విజయవాడలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పాలకొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను ఆమె వివరించారు. నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ అధినేత తమను ఆదేశించినట్లు తెలిపారు. మనం ఎవరికీ చెడు చేయలేదని, మంచి చేసి ఓడిపోయామని అన్నారన్నారు. మరి కొన్నిరోజుల్లోనే పార్టీ పూర్వవైభవం సాధిస్తుందని, అంతవరకు ఓపికతో వేచి చూడాలన్నారన్నారు.

రాజీయే రాజమార్గం

● జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎ.విజయ్‌రాజ్‌కుమార్



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ కోర్టు జడ్జి విజయ్‌రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: రాజీయే రాజమార్గమని, తెలిసీ తెలియక వివిధ కేసుల్లో ఇరుక్కున్న కక్షిదారులు రాజీమార్గం అనుసరించి, కేసుల నుంచి విముక్తి పొందాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ కోరారు. స్థానిక కోర్టు భవనంలో ప్రీ లోక్ అదాలత్ కార్యక్రమం గురువారం నిర్వహించి, పలు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా అందే సేవలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వీలైనంతవరకు గ్రామస్థాయిలో గ్రామపెద్దల సమక్షంలో కేసులు పరిష్కరించుకునేందుకు చొరవచూపాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.సత్యనారాయణ, న్యాయవాదులు ఎస్.కృష్ణారావు, గోవిందరావు, జి.సత్యం, చందక జగదీష్‌కుమార్, ఎం.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

పరిష్కార మార్గాలు అన్వేషించాలి



కొత్తగా యూనియన్‌లో చేరిన వారికి సభ్యత్వ నమోదు పత్రాలు అందిస్తున్న యూనియన్ నాయకులు

పాలకొండ రూరల్: ఆర్టీసీ ఉద్యోగులు సమన్వయంతో వ్యవహరిస్తూ తమ సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించాలని ఎన్‌ఎంయూ(నేషనల్ మజ్దూర్ యూనియన్) అధ్యక్షుడు ఎస్.టి.రావు అన్నారు. మండల కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో యూనియన్ సభ్యులతో గురువారం సమావేశమైన ఆయన.. ఉద్యోగులకు విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, సంస్థ అనుసరిస్తున్న విధివిధానాల్లో లోపాలపై సమీక్షించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యూనియన్ ఎప్పుడూ కృషి చేస్తుందని, ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అనంతరం కొత్తగా యూనియన్‌లో చేరిన 60 మంది ఉద్యోగులకు సభ్యత్వం నమోదు చేసి, గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ పాలకొండ డిపో కార్యదర్శి వి.రాజేష్, నేతలు సుబ్బారావు, వైకుంఠరావు, సంగమేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

పార్వతీపురం టౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆయుష్ వైద్యురాలు డాక్టర్ సుశీల తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు స్థానిక ఏపీఎన్‌జీఓ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, యోగా క్లబ్‌లు, విద్యార్థులు పాల్గొంటారని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సీతానగరం: పార్వతీపురం-సీతానగరం ప్రాంతాల మధ్య ఉన్న 33/11 కేవీ విద్యుత్ లైన్‌లో శుక్రవారం ఉదయం ఏడుగంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకూ పెట్రోలింగ్ చేయనున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ జగన్మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం నుంచి అప్పయ్యపేట ఫీడర్, బూర్జ ఫీడర్‌కు విద్యుత్ సప్లై అవుతున్న 33/11 కేవీ విద్యుత్ లైన్లు తరచూగా మరమ్మతుల బారిన పడుతున్న కారణంగా ఏపీఈపీడీసీఎల్ ఉన్నతాధికారుల సూచనల మేరకు పూర్తి స్థాయిలో పెట్రోలింగ్ చేయాలని నిర్ణయించామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం పట్ల వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేతనదారులకు 6,91,064 పనిదినాలు

గరుగుబిల్లి: మండలంలోని 25 పంచాయతీల్లోని వేతనదారులకు 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 6,91,064 పనిదినాలు కల్పించినట్లు ఏపీవో ఎం.గౌరీనాథ్ గురువారం తెలిపారు. పనుల్లో పాల్గొన్న వేతనదారులకు రూ.16.57 కోట్లు వేతనాలుగా చెల్లించడం జరిగిందన్నారు. అలాగే వివిధ రకాల పనులకు మెటీరియల్ కింద రూ.4.38 కోట్లు వెచ్చించడం జరిగిందన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పనులు కల్పించడం జరుగుతోందన్నారు.

మందులు అందుబాటులో ఉంచండి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ప్రాంతాల్లోని అన్ని ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో గురువారం కోరారు. మలేరియా జ్వరంతో బాధపడుతున్న కొంతమంది విద్యార్థులు ఇటీవల మండలంలోని భద్రగిరి సీహెచ్‌సీకి వెళ్తే అక్కడ మందులు లేవని సిబ్బంది చెప్పడం చాలా బాధాకరమన్నారు. రానున్న వర్షాకాలంలో మలేరియా, డెంగీ, డయేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఈ నేపథ్యంలో అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన మందులు ఆస్పత్రుల్లో ఉండేలా చూడాలన్నారు. అలాగే పార్వతీపురం ఐటీడీఏలో రెగ్యులరైజ్ అయిన సీఆర్‌టీల్లో 16 మందిని నిబంధనలకు వ్యతిరేకంగా బాలికల ఆశ్రమ పాఠశాలల్లో నియమించారన్నారు. ఈ విషయంపై అధికారులు దృష్టిసారించి, బాలికల పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులనే నియమించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి



తల్లిదండ్రుల సమావేశంలో పేరెంట్స్ విధులు వివరిస్తున్న ప్రిన్సిపాల్ శివకుమార్

భామిని: పిల్లల చదువు, ప్రవర్తన, నడవడికలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని ఎంఈవోలు ఎ.శ్రీనివాస్, వి.భాస్కరరావు, ప్రిన్సిపాల్ అర్.శివకుమార్ సూచించారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో పీఎంసీ చైర్మన్ సత్యనారాయణ సాంత్రో అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల విధులను వివరించారు. పిల్లలు ఎలా చదువుతున్నారు.. ఎలా ఉంటున్నారు.. ఎవరితో ఏ విధంగా ప్రవర్తిస్తున్నారన్న అంశాలను నిశితంగా పరిశీలించాలన్నారు. చెడు అలవాట్లు, ప్రవర్తన గమనిస్తే వెంటనే అప్రమత్తమై మంచి బుద్ధులు నేర్పించాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, ఇస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని, బాగా చదివి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బాబూరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిని కలిసిన మాజీ ఎమ్మెల్యే



మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్:

తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వైఎస్సార్‌సీపీ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశంలో పాల్గొన్న పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమావేశం అనంతరం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. ప్రజల పక్షాన పోరాడి, కార్యకర్తలకు అండగా నిలిచి ధైర్యంగా ముందుకు వెళ్లమని తమ అధినేత ఈ సందర్భంగా భరోసా ఇచ్చారని జోగారావు తెలిపారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

సీతానగరం: ప్రభుత్వంలోని ఇతర శాఖల అనుసంధానంతో ప్రజలకు మెరుగైన సేవలందించడమే రెవెన్యూ శాఖ ముఖ్య ఉద్దేశమని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ఏర్పడి 250 సంవత్సరాలైన సందర్భంగా వీఆర్వోలు, సర్వేయర్లతో ఉత్సవాలు నిర్వహించామన్నారు. వివిధ శాఖల అధికార సిబ్బందితో రెవెన్యూశాఖ సిబ్బంది సమన్వయం చేసుకుని ప్రజలకు మెరుగైన సేవలందించడానికి అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ పి.చిట్టెమ్మ, సహాయగణాంకఅధికారి సతీష్, ఆర్‌ఐ ఎన్. శ్రీనివాసరావు, ఎస్‌ఏ రామారావు, వీఆర్వోలు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత

పార్వతీపురంటౌన్/కొమరాడ: పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత ప్రశంసా పత్రాలను బహూకరించారు. కొమరాడ మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయంలో గురువారం నిర్వహించిన 'మై స్కూల్ మై ప్రైడ్' ప్రోగ్రాంలో భాగంగా రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రత్యేక అధికారిగా వ్యవహరించారు.

ఈ సందర్భంగా 2024వ సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతూ ప్రశంసాపత్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ హేమలత మాట్లాడుతూ విద్యార్థులు చదువును కొనసాగించాలని, ఉన్నత చదువులు, ఉన్నత హోదాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

బహుమతులు అందుకున్న విద్యార్థినుల వివరాలు: హిమరిక మానస (స్కూల్ ఫస్ట్), తెలికి లావణ్య (స్కూల్ సెకెండ్), బొజ్జ రాధిక(స్కూల్ థర్డ్), రాయగడ హేమలత(100/100 మ్యాథ్స్), బిడ్డిక చిన్నారి (100/100 మ్యాథ్స్).

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుల రక్తదానం



రక్త దానం చేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

పార్వతీపురంటౌన్: కొమరాడ మండలం, సర్వేపాడు గిరిజన గ్రామానికి చెందిన ఎం. ప్రశాంత్ అనారోగ్య పరిస్థితుల్లో గురువారం పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చేరారు. బి పాజిటివ్ రక్తం అవసరమని వైద్యులు సూచించడంతో పేషెంట్ బంధువులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్వచ్ఛంద సహాయకుడు, ఎమ్మార్‌నగరం నివాసి నొత్త చిన్నారావు తెలియజేశారు. వెంటనే ఆయన స్పందించి మరోరక్తదాత వారణాసి వేదగిరితో వచ్చి ఇద్దరూ రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, సెక్రటరీ బీఎస్‌బీ రావులకు, పేషెంట్ బంధువులు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్వతీపురం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యులు బొండపల్లి వెంకటరమణ, మేనేజింగ్ కమిటీ సభ్యుడు బోటు రామకృష్ణ పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

● పట్టించుకోని అధికారులు

సాలూరు రూరల్:

మండలంలోని మామిడిపల్లి గ్రామంలో వెంగళరాయ సాగర్ కాలనీ, ఆర్‌అండ్‌బీ రోడ్డు మధ్యలో ఉన్న స్థలంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. ఈ విషయంలో అడ్డుకోవాల్సిన పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారులు కానీ పట్టించుకోడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాగే ఆక్రమణలు కొనసాగితే రాబోయే రోజుల్లో రోడ్డు విస్తరణ చేయాల్సి వస్తే ఆ సమయంలో అక్రమ నిర్మాణాలు అధికారులకు తలనొప్పిగా మారే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.



మామిడిపల్లిలో రోడ్డు పక్కన కొత్త నిర్మిస్తున్న షాపులు

జాబ్‌మేళా రేపు

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్యామ్‌బాబు గురువారం తెలిపారు. జిల్లా ఉపాధి కల్పన సంస్థ సహకారంతో ఉదయం 10 గంటలకు ఈ మేళా నిర్వహిస్తున్నామన్నారు. 18 నుంచి 23 ఏళ్ల మధ్య వయసు కలిగిన పాలిటెక్నిక్, బీటెక్, డిగ్రీ అర్హత కలిగిన యువతీ, యువకులు ముందుగా (https://employment.ap.gov.in)వెబ్‌సైట్‌ను సంప్రదించి, వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణపత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలన్నారు. మరింత సమాచారానికి ఫోన్ నంబర్9908827160ను సంప్రదించాలని కోరారు.